క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 29 : విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించేవిధంగా చూడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ఉప్పల్‌లో అండర్17, అండర్-14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో శిక్షణ అందించాలని, నైపుణ్యంతోనే ఉత్తమ ప్రతిభ చాటుతారని లిపారు. విద్యార్థుల అభ్యున్నతికి తమవంతు తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. దేశం గర్వించేస్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పీడీ పద్మావతి, రమేశ్‌రెడ్డి, ముశ్యం శ్రీను, మేకల మధుసూదన్‌రెడ్డి, రమేష్ గుప్తా, బాలకృష్ణ, సుక్క కిరణ్, నిరంజన్, శేఖర్, రాంరెడ్డి, భరత్ పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన..

కాప్రా, అక్టోబర్ 29: నియోజకవర్గం పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ దగ్గరలో రూ.16లక్షలతో చేపట్టే భూగర్భడ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మహేశ్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, చక్రపాణి, కిశోర్, బాబు, అనిల్ బాబు, యాద య్య, వెంకటేశ్, బాలనర్సింహ,నర్సింగరావు, జలమండలి డీజీఎం సతీశ్, మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

భూగర్భడ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

బాధ్యతగా వ్యవహరించాలి

మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి కృష్ణకుమార్

శామీర్‌పేట, అక్టోబర్ 29 : ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను తెలుసుకోవాలని విజిలెన్స్ అధికారి పిల్లి కృష్ణకుమార్ అన్నారు. ఈసీఐఎల్ కంపెనీ టీమ్ ఆధ్వర్యంలో అలియాబాద్‌లో గ్రామ సభ నిర్వహించి ఆరోగ్య, వైద్యం, టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ మాట్లాడుతూ మంచి సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్య, వైద్య, టెక్నాలజీ తదితర అంశాల్లో సౌకర్యాలు, లాభాలు, నష్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి యాదగిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామస్తులు తాడెం కుమార్, సంజీవరెడ్డి, యాదయ్య, భిక్షపతి, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి లేని క్రాకర్స్ స్టోర్ స్వాధీనం

ఘట్‌కేసర్,అక్టోబర్29: అనుమతి లేని క్రాకర్స్ స్టోర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకుశాపురంలో మహ్మద్ రశీద్ అనే వ్యక్తి పోలీసుల అనుమతి లేకుండా క్రాకర్స్‌ను తెచ్చి స్టోర్ చేసినట్లు స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా, అనుమతి లేకుండా, ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా క్రాకర్స్‌ను స్టోర్ చేయడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణుల అలయ్ బలయ్

శామీర్‌పేట, అక్టోబర్ 29 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టెల పండుగ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు బొల్లెబోయిన చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. దీపావళిని పురస్కరించుకుని ప్రతి ఏటా నాయీ బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని మంగళవారం శామీర్‌పేటలో నిర్వహించారు. నాయీ బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌నాయీ, మహేందర్‌నాయీ, మనోహర్‌నాయీ, జిల్లా అధ్యక్షుడు చిటుకుల సత్యంనాయీ, మండల అధ్యక్షుడు గోపాల్‌నాయీ, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు భిక్షపతినాయీ, యాదగిరినాయీ, రమేశ్ నాయీ, ఎల్‌దాస్ నాయీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌ను విజయవంతంగా పూర్తి చేయాలి

మేడ్చల్, అక్టోబరు 29 : బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను(ఎస్‌కేఎస్) విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూపర్‌వైజర్లకు సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ సీపీవో శేఖర్‌తో కలిసి సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే ఎలా నిర్వహించాలి, డేటా ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలి వివరించారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబీలో ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత కూడా సూపర్‌వైజర్లదేనని ఆమె ఆదేశించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశాన్ని వివరించారు.

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

వ్యక్తి అదృశ్యం

నేరేడ్‌మెట్, అక్టోబర్ 29: మతిస్థిమితంలేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం క్రరీ మీనయ్య గణేశ్‌నగర్ రామకృష్ణ స్కూల్ సమీపంలో నివాసముంటాడు. అయితే మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటినుంచి బయటికి వెళ్లి తిరికి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మీనయ్య (ఫైల్)

రక్తదానం ప్రాణదానంతో సమానం

జవహర్‌నగర్, అక్టోబర్ 29: రక్తదానంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని, శాంతిభద్రతల పరిరక్షణలో విశ్రాంతి లేకుండా ఉండే పోలీసులు సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేయడం గొప్ప విషయమని కుషాయిగూడ ఏసీపీ మహేశ్ అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సైదయ్య ఆధ్వర్యంలో మంగళవారం యాప్రాల్‌లోని డీఎస్ఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుషాయిగూడ ఏసీపీ మహేశ్ హాజరై మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని, మనిషి ప్రాణాలను కాపాడే మహత్తర దానం రక్తదానమని, ప్రతి పౌరుడు రక్తదానాన్ని బాధ్యతగా తీసుకొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు, యువత 40మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్సై ఇద్రీస్‌అలీ, ఎస్సైలు రామునాయక్, లక్ష్మయ్య, జవహర్‌నగర్ పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎస్‌హెచ్‌వో సైదయ్య, అడ్మిన్ ఎస్ఐ ఇద్రీస్‌అలీ

పీపీకి ఉత్తమ సేవా పురస్కారం

మేడ్చల్, అక్టోబరు 29 : మేడ్చల్ జిల్లా 2వ అదనపు, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఇటీవల సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పీపీ శ్యామ్‌రావుకు కమిషనర్ అవినాశ్ మహంతి అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వివిధ కేసుల్లో బాధితుల తరుపున వాదించి, బాధ్యులకు శిక్షలు వేయించినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. శ్యామ్‌రావు వాదించిన కేసుల్లో ఇద్దరికి జీవిత ఖైదు, మరో ఇద్దరికి 20 ఏండ్ల జైలు శిక్ష, ఒకరికీ ఏడేళ్ల జైలు శిక్ష పడింది. ఆయన సేవలను గుర్తించిన పోలీస్‌శాఖ ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించింది.

పీపీ శ్యామ్‌రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి

పట్టుదలతో చదివితే సివిల్స్ సాధ్యమే

మేడ్చల్, అక్టోబరు 28 : పట్టుదల ఉంటే సివిల్స్ సర్వీసెస్ పరీక్ష సాధించి, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావచ్చునని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్, రక్షణ మంత్రిత్వ శాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో మంగళవారం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ సాధించడం ప్రతిష్టాత్మక ఐఐటీ వంటి సంస్థల్లో చదివిన వారికి మాత్రమే సాధ్యమని అపోహ పడుతుంటారన్నారు. ఆ అపోహను తుంచి వేయాలని, చిన్న చిన్న కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా సివిల్ సర్వీసెస్ పరీక్ష సాధించిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీరమణ ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రతి ఏడాది 90 మందిని సివిల్ సర్వీసెస్‌కు ఎంపికకావడం లక్ష్యంగా తమ అకాడమీ పని చేస్తుందన్నారు. కెరీర్ డెవలప్ మెంట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్, తెలంగాణ పబ్లికేషన్స్ మేనేజర్ గణేశ్, అసిస్టెంట్ మేనేజర్ కేఆర్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చీఫ్ మెంటర్ వివేకానంద

ఏఎస్ రావును ఆదర్శంగా తీసుకోవాలి

మల్లాపూర్, అక్టోబర్ 29 : ఈసీఐఎల్ కంపెనీ వ్యవస్థాపకుడు అయ్యగారి సాంబశివరావు(ఏఎస్‌రావు) అడుగు జాడల్లో ప్రతి విద్యార్థి నడువాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ ఫస్ట్ ఫేస్ మైదానంలో సెయింట్ పాల్స్ పాఠశాల విదార్థులకు డాక్టర్ ఏఎస్‌రావు జీవిత చరిత్ర చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈసీఐఎల్ కంపెనీ స్థాపించి ఏఎస్‌రావు దేశానికే గొప్ప పేరు తెచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయులు నసీమా, పాఠశాల నిర్వాహకుడు సత్యారెడ్డి, విజ్ఞాన వేదిక నిర్వాహకుడు రమేశ్, అధ్యక్షుడు యాదగిరి, హెచ్‌బీకాలనీ ఫేజ్-2 అధ్యక్షుడు వెంకటాచారి, నాయకులు జగదీశ్, వెంకటేశ్, చంద్రమోహన్, నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం

సమైక్యత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

కీసర, అక్టోబర్ 29; జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ సమైకత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విద్యార్థులకు సమైకత్య దినోత్సవ ప్రాముఖ్యతను గురించి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజారావు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా పటేల్ తీసుకున్న నిర్ణయాలు జాతి ఐక్యతకు ఎంతగానో తోడ్పాడ్డాయని తెలిపారు. కుల, మత,భాష, ప్రాంతీయ బేధాలు లేకుండా మనమంతా భారతీయులుగా జీవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

జవహర్‌నగర్, అక్టోబర్ 29: సాయం చేయడంలోనే మధురానుభూతి కలుగుతుందని, దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని మదర్‌థెరిస్సాకాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేశ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగులకాలనీలో సేవాభారతి ట్రస్టు ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సాకాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేశ్ సమక్షంలో దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు అందజేశారు. అనంతరం 80మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వెంకటరమణ, నారాయణశర్మ, ప్రవీణ్, హారిక, విజయ, సునీతలక్ష్మి, రత్నప్రభ, సోషల్ వర్కర్ మంజుల పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సేవాభారతి ట్రస్టు సభ్యులు, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్

జిల్లా రైతు సమాఖ్య నూతన కార్యవర్గం

మేడ్చల్, అక్టోబరు 29 : కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో జిల్లా రైతు సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దం సంజీవ రెడ్డి(అలియాబాద్), గౌరవ అధ్యక్షుడిగా వంగ పెంటారెడ్డి(పోతారం), ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం(లక్ష్మాపూర్), ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, కేతావత్ సుధాకర్ నాయక్, సహాయ కార్యదర్శులుగా సుధాకర్ రెడ్డి, నర్సింగరావు, గంట గౌరీ శంకర్, జగన్మోహన్ రెడ్డి, కోశాధికారిగా ఆంజనేయులు, సమన్వయకర్తలుగా తాళ్ల నర్సింహ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి హామీ పథకం కో ఆర్డినేటర్‌లుగా రాం రతన్, సుదర్శన్ రెడ్డి, బుద్ది రాజు, సత్యానారాయణ, శేఖర్‌లను ఎన్నుకున్నారు.

రైతు సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

కామాక్షిపురం సమస్యల పరిష్కారానికి కృషి

డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్,అక్టోబర్ 29 : రామంతాపూర్ డివిజన్ పరిధిలోని కామాక్షిపురం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు తెలిపారు. మంగళవారం పలువురు అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా యూజీడీ వాటర్ లైన్, రేన్ వాటర్ కు సంబంధించి పలు విషయాలను అధికారుల దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ నాగమణి, ఏఈ రవీందర్, మేనేజర్ కిషన్, సూపర్‌వైజర్ మహేందర్, నాయకులు ,చింతోజు శ్రీనివాసచారి, కాలనీ అధ్యక్షుడు దుర్గేశ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు, రవి, అంజయ్య, నర్సింహ, శంకర్‌రెడ్డి, లింగం, రవి, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు మేడ్చల్ విద్యార్థుల ఎంపిక

మేడ్చల్, అక్టోబరు 29: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు పాల్గొని, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. వికారాబాద్ పట్టణంలో మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు జేఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని, వచ్చే నెలలో సంగారెడ్డిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 ఏళ్లలోపు విభాగంలో గోవింద్ గుప్తా, అనంత చైతన్య, వీరభద్ర, 17 ఏళ్లలోపు విభాగంలో విక్రాంత్, చరణ్ ఎంపికయ్యారు. విద్యార్థులను ఎస్‌జీఎఫ్ వికారాబాద్, మేడ్చల్ జిల్లా కార్యదర్శులు నర్సింలు, కిష్టయ్య, చందర్, శంకర్ గౌడ్, సాయికుమార్, ప్రవీణ్, తరుణ్, మధులు ఘనంగా సన్మానించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌కు చెందిన విద్యార్థులు స్కేటింగ్ ప్రతిభ చూపి, పతకాలు సాధించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి గ్రామానికి చెందిన మండల ప్రదీప్‌కుమార్, మండల ఆరుశ్, మండల అద్విక్ తేజ జీఆర్ఎస్ అకాడమీ నిర్వహించిన ఇంటర్ స్కూల్ రోల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ చూపారు. ప్రదీప్‌కుమార్, ఆరుశ్ బంగారు పతకాలు సాధించగా, అద్విక్ తేజ రజత పతకాన్ని సాధించాడు. **-మేడ్చల్, అక్టోబరు 29 :**



యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్,అక్టోబర్29: యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు .పోలీసుల వివరాల ప్రకారం ఘట్‌కేసర్‌లోని వీకర్‌సెక్షన్ కాలనీలో నివాసం ఉండే బర్ల శివకుమార్(32) కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్థాపానికి గురైన యువకుడు నిప్పంటించుకొని మృతి చెందాడు. ఘట్‌కేసర్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలలు సేకరించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్ 3 బ్యాడ్మింటన్

అకాడమీలో ఓపెన్ టోర్నమెంట్

నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 29: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో నవంబర్ 14నుంచి 16వ తేదీ వరకు రాష్ట్ర ఓపెన్ అండర్ 11, అండర్ 13 బాడ్మింటన్ టోర్నమెంట్ జరగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జనరల్ సెక్రటరీ ప్రభాకర్ భాస్కర్, కోశాధికారి వికాస్ హర్ష యాదవ్, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రమేశ్ పిల్లలమర్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ నాగోలులోని ఆర్ 3 (ఎస్ జోన్)బ్యాడ్మింటన్ అకాడమీలో జరగనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు ప్రసంసా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు నవంబర్ 11 వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా భారత్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ హాజరుకానున్నట్లు వారు తెలిపారు. టోర్నమెంట్ వివరాల కోసం 9849909992ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

కీసర, అక్టోబర్ 29: కీసర మండలం కరీంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు కరీంగూడ నివాసి సింగిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి స్వచ్ఛందంగా టై, బెల్ట్, ఐడీ, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆదుకోవడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయులు సుధాకర్, మధుబాబులతో పాటు ఏపీసీ చైర్మన్ మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

మానవ హక్కులపై అవగాహన ఉండాలి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 29 :మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మానవ హక్కుల జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది అయ్యప్ప అరుణాచల అన్నారు. వినాయకనగర్ డివిజన్ శివసాయినగర్‌లోని రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడు మెమిన్ భాష, చైర్మన్ కేఎల్ నారాయణరెడ్డిని నియమిస్తూ ధ్రువపత్రాలను వారికి అందజేశారు.

ఘనంగా మైసమ్మ అమ్మవారి వార్షికోత్సవం

కీసర, అక్టోబర్ 29: చీర్యాల్‌లోని శ్రీ బంగారుమైసమ్మ అమ్మవారి 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం చీర్యాల్‌లోని జిన్నారం కాలనీలో నిర్మించిన శ్రీ బంగారుమైసమ్మ అమ్మవారి వార్షికోత్సవానికి శశిధర్ అనే వ్యక్తి 50 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేశారు. దాత శశిధర్‌ను ఆ గ్రామ మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

మల్కాజిగిరి, అక్టోబర్ 29: ప్రభుత్వంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మంగళవారం అల్వాల్‌లోని ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కోదండరాం మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతం ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సత్యం గౌడ్, శ్రీనివాస్, జగదీశ్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

సైబర్ ఫైనాన్స్ మోసం..

యువకుడి ఆత్మహత్య

మల్కాజిగిరి, అక్టోబర్ 29: సైబర్ ఫైనాన్స్ మోసంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాజిగిరి ఎస్సై సునీత్‌కుమార్ కథనం ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన వెంకటేశ్వర కుమార్ పెద్ద కుమారుడు వంశీ కుమార్ అంతర్జాతీయ ఫైనాన్స్‌లో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి మోసపోయాడు. ఈ విషయం తెలియగానే తండ్రి ఫోన్ చేయడంతో వంశీ మాట్లాడలేదు. కుమారుడు ఫోన్ ఎత్తకపోవడంతో ఇంటికి వచ్చి మొదటి అంతస్తులోని గదికి వెళ్లాడు. అప్పటికే ఉరేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని దవాఖానకు తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి మరణించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌ను

సందర్శించిన డీసీపీ

మేడ్చల్, అక్టోబరు 29 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను పరిశీలించి, ఎస్సైలు, సిబ్బంది సమావేశమయ్యారు. నేరాల అదుపునకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యానారాయణ, ఎస్సైలు, ఏఎస్సైలు పాల్గొన్నారు.

దవాఖానకు విరాళం

విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్

మేడ్చల్, అక్టోబరు 29 : మేడ్చల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొన్నేళ్లుగా ఎక్స్ రే యంత్రం ఫిల్మ్, రసాయనాలు లేక నిరుపయోగంగా ఉంది. దీంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులు ఆశ్రయించాల్సి వస్తుంది. విషయాన్ని తెలుసుకున్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ రూ.10వేలు తన జన్మదినం సందర్భంగా విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ గురు భార్గవ్‌కు అందజేశారు. ఈ మొత్తంతో దాదాపు నెల రోజుల పాటు టీబీ, ఎముకలు విరిగిన వారికి ఎక్స్ రే తీయవచ్చని వైద్యుడు తెలిపారు. తాను విరాళం ఇవ్వడంతో దాతలు ముందుకు వచ్చేలా చూస్తానని సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ కౌడె మహేశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది, ఏమనగా, నా క్లయింట్ **రేగు మహేందర్, తండ్రి: లేట్ రేగు కిష్టయ్య,** నివాసం: వీకర్ సెక్షన్, దమ్మాయిగూడ, నాగారం, కీసర మండలం, మేడ్చల్ జిల్లా వారు అలియాబాద్ గ్రామం, శామీర్‌పేట మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వద్దగల ఎక. 0-10 గుంటల విస్తీర్ణం (సర్వే నెం. 222/A/U/2 మరియు సర్వే నెం. 222/B/U/2) మరియు ఎక. 0-10 గుంటలు (సర్వే నెం. 222/A/U/2 మరియు సర్వే నెం. 222/B/U/1లో) మొత్తం ఎక. 0-20 గుంటల విస్తీర్ణంగల భూమికి సంబంధించి దాని యజమాని బత్తుల లక్ష్మణ్ మరియు బత్తుల ప్రేమ్‌కుమార్ మరియు సోదరీమణుల నుండి కొనుగోలు చేయుటకు 19-08-2022 తేదీనాటి అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు తగిన అమ్మకం ప్రతిఫలం చెల్లించారు మరియు తర్వాత బత్తుల లక్ష్మణ్ ద్వారా నా క్లయింట్‌కు తెలిసిన వ్యక్తి పేరున ఎక. 0-10 గుంటల భూమి కొరకు రిజిస్టర్ చేశారు మరియు మిగిలిన **ఎక. 0-10** గుంటల భూమి కొరకు మిగిలిన అమ్మకం ప్రతిఫలం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు.

సదరు విక్రయదారు బత్తుల ప్రేమ్‌కుమార్ మరణించారు మరియు నా క్లయింట్ సదరు విక్రయదారు భార్య మరియు కూతురు (బత్తుల మంజుల, బత్తుల శిహిత)కు మిగిలిన అమ్మకం ప్రతిఫలం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, సదరు న్యాయవారసులు పై సదరు లావాదేవీని మరుగుపరుస్తూ మూడవ పార్టీలకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నారు. అందువల్ల, పై సదరు భూమికి సంబంధించి **బత్తుల మంజుల, బత్తుల శిహితతో** ఏ విధమైన లావాదేవీ కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. లేనిచో సదరు వ్యక్తులు తమ స్వంత నష్టపూచీకత్తుపై అలా చేసినవారవుతారు.

సం/- మీసాల నారాయణ, అడ్వకేట్
ఆఫీస్: ఇం.నెం. 5-75/49, RTC కాలనీ,
తూముకుంట గ్రామం & మున్సిపాలిటీ, శామీర్‌పేట మండలం,
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, **ఫోన్: 9948413529.**